పాత ఇళ్లపై సర్కార్ నజర్

- శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశాలు
- కూల్చివేతలపై ప్రణాళికలు సిద్ధం
- ఇంటి యజమానులకు నోటీసులు
- పాత ఇళ్లకు మార్కింగ్
- పల్లెప్రగతిలో కూల్చివేతలకు రంగం సిద్ధం


ఎల్లారెడ్డిపేటలో పాత, శిథిలావస్థలో ఉన్న ఇల్లు

ఎల్లారెడ్డిపేట: వర్షాకాలంలో పురాతనమైన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసముండడం ప్రమాదమని భావించి, వాటిని కూల్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు ఎన్ని ఉన్నాయో లెక్కలను తీస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పాత ఇళ్ల నుంచి ఇంటి యజమానులు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. పాత ఇళ్లను కూల్చివేయడానికి గ్రామ పంచాయతీ అధికారులు ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. గ్రామాల వారీగా సర్వే చేసి పాత ఇళ్లను కూల్చివేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కూల్చివేయడానికి నిర్ణయించిన ఇళ్లకు మార్కింగ్ చేస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 20 పాత ఇళ్లు, 45కు పైగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లను అధికారులు గుర్తించారు. ముందుగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించాలని నిర్ణయించారు. అయితే గత సీజన్‌లో మండల వ్యాప్తంగా సుమారు 25 ఇళ్లను అధికారులు గుర్తించి పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా కూల్చివేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో అధికారులు పురాతనమైన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లపై ఫోకస్ చేస్తున్నారు.

నోటీసులు జారీ..

గ్రామాల్లో పురాతనమైన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను స్వచ్ఛందంగా కూల్చివేసుకునేందుకు పంచాయతీ అధికారులు ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. పాత ఇళ్లను తొలగించుకునే ఆర్థికస్తోమత లేని వారిని గుర్తించి గ్రామ పంచాయతీ అధికారులే ఖర్చులు భరించి కూల్చి వేసే బాధ్యత తీసుకుంటున్నారు. ఇంటి యజమానులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూల్చి వేసుకుంటే వారికి పారితోషికం ఇస్తున్నారు. అలాగే ఆర్థికస్తోమత లేని వారు కూల్చివేతలపై గ్రామ పంచాయతీలలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసుకుంటే కూల్చి వేసే బాధ్యత ఇక పంచాయతీలదే. మండలంలో గత వర్షాకాలంలో పాత ఇళ్లు కూలి వాటిలో నివాసముండే ముగ్గురు వ్యక్తులు మరణించారు. అలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా అధికారులు ముందస్తుగానే ఇళ్ల తొలగింపుపై దృష్టి సారించారు.

గ్రామాల్లో చాటింపు

మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు పాత ఇళ్లను గుర్తించి సంబంధిత గ్రామాల్లో ఫలానా వారు తమ శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చివేసుకోవాలని చాటింపు చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటే పంచాయతీ అధికారులు వారి చిరునామాలు తెలుసుకోని సమాచారం అందిస్తున్నారు. బయట ప్రాంతాల్లో ఉంటున్న వారి అనుమతుల మేరకు ఇళ్లను కూల్చివేసే బాధ్యత పంచాయతీలే తీసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఇళ్ల కూల్చివేతలో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పాతకాలంలో నిర్మించిన ఇళ్లను ఆనుకోని మరికొన్ని ఇళ్లు ఉండడంతో పక్కవారి అభ్యంతరాలతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. అలాంటి వాటి విషయంలో తక్షణ చర్యలు తీసుకోకుండా ఇళ్ల నుంచి వారిని వేరే సురక్షిత ప్రాంతాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించి ఈ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో అధికారులు ముందుకు పోతున్నారు.

కూలిన ఇంట్లో ఉన్న నిరుపేదలకు గృహలక్ష్మి

కూలడానికి సిద్ధంగా ఉండి, ఇళ్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న పేదలకు గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఇలాంటి వారు 25 మంది ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. వీరి ఇళ్లను తొలగించిన పక్షంలో ప్రత్యామ్నాయంగా గూడు కల్పించేందుకు గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులను గుర్తించి ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ముందుచూపుతో ఇళ్ల తొలగింపు



వర్షాకాలంలో ప్రజలు పాత ఇళ్లలో ఉండి తల దాచుకోకుండా ముందస్తుగా పాత ఇళ్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నాం. ఇళ్లను తొలగించుకునే ఆర్థికస్తోమత లేనివారి ఇళ్లను జీపీలు కూల్చివేసే బాధ్యత తీసుకుంటున్నాయి. ఇళ్లు కోల్పోయిన పేదవారికి ప్రాధాన్యత క్రమంలో గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లను కేటాయిస్తాం. అలాగే పూర్తిగా వేరే చోట ఉండలేని పరిస్థితుల్లో ఉన్న వారు, ఒంటరిగా నివాసం ఉన్న వారిని స్థానిక వృద్ధాశ్రమంలో చేర్పించి పూర్తి బాధ్యతలు ప్రభుత్వం తీసుకుంటుంది.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి


అభివృద్ధి పనులకు పూజలు నిర్వహిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: ప్రణాళికబద్ధంగా సిరిసిల్ల పట్టణాన్ని సమగ్రాభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. సోమవారం స్థానిక 13వ వార్డులో చేపడుతున్న రూ.15 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టి మాట్లాడారు. మంత్రి కేటీఆర్ చొరవతో పట్టణం దశదిశాల వృద్ధి చెందుతుందన్నారు. 39 వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం


మాట్లాడుతున్న అంకని భాను

సిరిసిల్లటౌన్: బడుగుల రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ నిరంతరం పోరాడుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను అన్నారు. సోమవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన మాట్లాడారు. పార్టీని గడపగడపకూ తీసుకెళ్లడానికి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సూచనలతో ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 13న సిరిసిల్ల, 14న వేములవాడ నియోజకవర్గాల్లో రాజకీయ సమ్మేళనాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నాయకులు పల్లె శ్రీకాంత్‌గౌడ్, బట్టు రాంచెంద్రం, గుగులోతు చంద్రునాయక్, బొడ్డు మహేందర్, రమేశ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన 'చెల్మెడ'


మంత్రి కేటీఆర్‌ను కలిసిన లక్ష్మీనరసింహారావు

వేములవాడఅర్బన్: రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం హైదరాబాద్ కలిశారు. మంత్రి నివాసంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.

12న పాఠశాలల బంద్

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాలతో ఉమ్మడి పోరాటాలు చేపడుతున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రంజిత్, దొబ్బల ప్రవీణ్, రమేశ్, అనీల్ పాల్గొన్నారు.

ఢిల్లీ ఫ్యాషన్ షోలో సిరిసిల్ల చిన్నోడు


ఢిల్లీ ఫ్యాషన్ షోలో అప్నాన్

సిరిసిల్లటౌన్: ఢిల్లీలో జరిగిన కిడ్స్ ఫ్యాషన్ షోలో సిరిసిల్ల బుడతడు తళుక్కున మెరిశాడు. పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మహ్మద్ అజీంపాషా కొడుకు మహ్మద్ అప్నాన్(8) ఢిల్లీ కిడ్స్ ఫ్యాషన్ షోకు ఎంపికయ్యాడు. హర్యానాలోని గుర్గావ్‌లో ఆదివారం నిర్వహించిన ఫ్యాషన్ పరేడ్‌లో ర్యాంపు వాక్‌తో అదరగొట్టాడు. సిరిసిల్ల చైతన్యభారతి స్కూల్‌లో రెండో తరగతి చదివే అప్నాన్ గతంలో అమేజాన్ పింక్ వోల్ఫ్ కంపెనీ టీషర్ట్స్ బ్రాండ్‌కు మోడల్‌గా చేశాడు.

వరదవెల్లి వాసికి డాక్టరేట్



బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గ్రామానికి చెందిన పీచర రవీందర్‌రావుకు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన అనురాగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. విధులు నిర్వహిస్తూనే మరోవైపు కేఎల్ యూనివర్సిటీ జీఎస్‌ఈ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ పర్యవేక్షణలో వినియోగదారు కనెక్షన్లు, సోర్స్ కోడ్, డాటా ట్రాన్స్‌మిషన్ భద్రపరిచేందుకు క్లౌడ్ ఫ్రేమ్ వర్క్ అంశంపై ఐదేళ్లు పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించిన రవీందర్‌రావును స్థానికులు, పద్మనాయక సంక్షేమ సంఘం సభ్యులు, అనురాగ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్, అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు.

పేద విద్యార్థులకు సహకారం


బస్‌పాస్‌లు అందజేస్తున్న సింగిల్‌విండో డైరెక్టర్

చందుర్తి: పేద విద్యార్థుల విద్యకోసం సహాయ సహకారాలు అందించనున్నట్లు సర్పంచ్ అంచా సుమారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ అంచా శ్రీహరిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులను ప్రోత్సహించేందుకు, విద్యార్థుల బస్ పాసులకోసం అయ్యే ఖర్చును ఆశిరెడ్డిపల్లె సర్పంచ్ అంచా సుమారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ అంచా శ్రీహరిరెడ్డి చెల్లించారు. మండలంలోని నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె, గొల్లపల్లి, తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల నుంచి సుమారు 36 మంది విద్యార్థులు చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిందుకు వెళ్తున్నారు. వారందరికి ఏడాది పాటు బస్ పాసులను అందజేసేందుకు సర్పంచ్ సుమారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీహరిరెడ్డి ఆర్టీసీకి రూ.15, 250లు చెల్లించి బసు పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీకృష్ణ, ఆర్టీసీ వీఆర్వో శ్రీనివాస్‌యాదవ్, కళాశాల ప్రిన్స్‌పాల్ మల్లేశం, లెక్చరర్ కిట్టు, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండెపోటుపై జాగ్రత్త


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు వెంకట్

వేములవాడ: గుండెపోటు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు వెంకట్ సూచించారు. సోమవారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైతే వ్యక్తిని వెల్లకిలా పడుకోబెట్టాలని, శ్వాస సక్రమంగా తీసుకోని సమయంలో సీపీఆర్ చేయాలని కోరారు. సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ... ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకట్రాజం, ప్రశాంత్‌రెడ్డి, దిలీప్, కౌన్సిలర్లు నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, నాయకులు వాసాల శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- ప్రభుత్వ హామీలు అమలు చేయాలి
- మధ్యాహ్న భోజన వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్
- కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా..

సిరిసిల్లటౌన్: పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... వంట కార్మికులకు ప్రతినెలా ఐదో తేదీలోపు బిల్లులు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసరాల చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నిత్యావసరాల వస్తువులు సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తదితర సమస్యలు వివరిస్తూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీస లక్ష్మణ్, కదారి రాములు, మంత్రి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోయినపల్లి/కోనరావుపేట: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం బోయినపల్లిలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ ఎంఈవో శ్రీనివాస్‌దీక్షిత్ కోనరావుపేటలో తహసీల్దార్ రవికాంత్‌కు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడి స్థానిక కార్మికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

అర్హులందరికీ దళితబంధు అందించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: దళితబంధు పథకాన్ని రాజకీయ నాయకులు జోక్యం లేకుండా కలెక్టర్ల ద్వారా అర్హులందరికీ అందించాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. దళిత హక్కులను కాపాడాలంటూ సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా దళితబంధు దరఖాస్తులు స్వీకరించాలని, పోడు, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న దళితులకు పట్టాలివ్వాలని, గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నిధులు మంజూరు చేయాలని, భూ పంపిణీకి అసైన్డ్ ల్యాండ్ కమిటీ పునరుద్ధరించాలని కోరారు. దళితుల సమస్యలను వివరిస్తూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మాట్ల అశోక్, మంద సుదర్శన్, జాన్సన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


మాట్లాడుతున్న తోట ఆగయ్య

గంభీరావుపేట: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి గ్రామాల్లో బూత్ కమిటీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలం ముస్తఫానగర్, నర్మాల, దేశాయిపేట గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, గ్రామశాఖల అధ్యక్షులు నర్సింగారావు, ఆకునూరి రాజేందర్, సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని 1, 12, 15వ వార్డులో బూత్ కమిటీ నియామక సమావేశంలో పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండాలలో బూత్ కమిటీలను పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఐదో రోజు సమ్మె


తంగళ్లపల్లిలో..


బోయినపల్లిలో..

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి/బోయినపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారంతో ఐదో రోజుకు చేరుకుంది. కోనరావుపేటలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఇల్లంతకుంట మండల పరిషత్ ఎదుట పంచాయతీ మహిళా కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. శిబిరాలను సీఐటీయూ మండల అధ్యక్షులు జక్కుల మహేందర్, బీఎస్పీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్, బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు మాంకాళి తిరుపతి జిల్లా ఈసీ మెంబర్ శ్యాగ యాదగిరి మండల అధ్యక్షుడు అలువాల అజయ్ సందర్శించి మద్దతు పలికారు.

చందాలతో దహన సంస్కారాలు

చందుర్తి: మండలంలోని కిష్టంపేటకు చెందిన పొలాల శ్రీలత అనే అనాథ మహిళ అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా గ్రామస్తులు చందాలతో దహన సంస్కారాలు నిర్వహించారు. భర్త గతంలో మృతిచెందగా ఇద్దరు కుమారులను దత్తత ఇచ్చారు. గ్రామానికి చెందిన రెబల్ స్టార్ యూత్, ఆదర్శ యూత్, యువ యూత్ రూ.5వేల చొప్పున, ఫ్రెండ్స్ యూత్ రూ.6 వేలు,మాజీ సర్పంచ్ బానాల గంగారెడ్డి రూ.2వేలు, జంగిడి మహేశ్ రూ.3 వేలు, మరో రూ.20 వేలు దాతలు అందజేశారని సర్పంచ్ కల్పన తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బోయినపల్లి: ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై మహేందర్ కోరారు. మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కమ్యూనిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు పీహెచ్‌సీ ఆవరణలో రోడ్డు ప్రమాదాలపై సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్‌పై వివరించారు. వైద్యాధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట


కప్పతల్లి ఆట ఆడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ రైతులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఎల్లారెడ్డిపేటలోని పురాతన శివాలయంలో సోమవారం రైతులు వరుణుడు కరుణించి వానలు పడాలని ప్రత్యేక పూజలు చేశారు. రోకలిబండకు కప్పను కట్టుకోని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తిరిగారు. శివలింగానికి జలాభిషేకం చేశారు. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, రైతు చర్చా మండలి అధ్యక్షుడు సందుపట్ల రాజిరెడ్డి, నేవూరి రెడ్డి సంఘం అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం వేద పండితులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, పంచసూక్తలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి వర్షాలు కురవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గుండయ్య శర్మ, శ్రీకాంత్ శర్మ, గౌతమ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో హరితహారం


మొక్కలు నాటుతున్న మెడికల్ అధికారి రేఖ

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం మెడికల్ అధికారి జిందం రేఖ ఆధ్వర్యంలో హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత



విద్యార్థులకు మైక్‌ను అందిస్తున్న ప్రశాంత్

ఎల్లారెడ్డిపేట: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాన్ని అందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి రాజం ప్రశాంత్ ఆర్‌జీకే ఫౌండేషన్‌ను స్థాపించి మొట్టమొదటి డొనేషన్‌ను తాను చదువుకున్న పాఠశాలకు అందించారు. పాఠశాలలోని విద్యార్థులు ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైన నిపుణుల బోధన, శిక్షణను పొందే పరికరం కాన్ఫరెన్స్ మైక్‌ను అందించారు. సర్పంచ్ కదిరె రజిత, ఎస్‌ఎంసీ చైర్మన్ సతీశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం అందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ


మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర వహించే అంగన్‌వాడీల హక్కులను ప్రభుత్వం కాలరాయొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సోమవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు నెలకు రూ.26వేల కనీస వేతనం అందించాలని, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు ఐక్యపోరాటాలతో సాధించుకుంటామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్స్ డే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు మోర అజయ్, తదితరులున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్ర క్రీడల పాఠశాలలు హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను, 4,5వ తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 12న రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన బాలబాలికలు జిల్లాస్థాయి ఎంపిక పరీక్షలో హాజరు కావాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలతో బుధవారం ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 94402 39783 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.